
ప్రజాశక్తి
సోమవారం 3 జూన్ 2024
5
విజయనగరం




## ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

**విజయనగరం :** జిల్లాలో ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి.. ఎన్నికల కమిషన్ సిఇఒకు తెలిపారు. రెండు కేంద్రాల్లో ఓట్లలెక్కింపు చేపడుతున్నామని వివరించారు. కౌంటింగ్ రోజు సిబ్బంది, ఏజెంట్లు నిర్ణీత సమయంలో ఆ కేంద్రాలకు చేరుకునేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషన్ సిఇఒ ముఖేష్ కుమార్ మీనా ఆదివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయంత్రంలోగా అన్ని నియోజకవర్గాల ఫలితాలు ప్రకటిస్తామని కలెక్టర్ చెప్పారు. ఆయా కౌంటింగ్ కేంద్రాల్లో మీడియాకు, కమ్యూనికేషన్ గదుల ఏర్పాటుకు చేస్తున్న ఏర్పాట్లపై సిఇఒ. తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాల్లో వేసిన పోస్టల్ బ్యాలెట్లకు సంబంధించి ఎన్నికల సంఘం జారీచేసిన నిబంధనలు పాటించి వాటికి అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్.డి.అనిత, తదితరులు పాల్గొన్నారు.

# క్షణక్షణం ఉత్కంఠ

**నువ్వా..నేనా అన్నట్లు సాగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై ఇటు అభ్యర్థుల్లోనూ, అటు ఆయా పార్టీల కార్యకర్తలు, ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. పోలింగ్ జరిగి సుమారు 20రోజుల తరువాత మంగళవారం ఫలితాలు వెల్లడి కానున్నాయి. పోలింగ్ జరిగిన 13వ తేదీ నుంచి అభ్యర్థులు పోలింగ్ బూత్‌ల వారీ అంచనాలు వేసుకున్నారు. గెలుపు తమదంటే తమదంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. శనివారం వెల్లడైన ఎగ్జిట్‌పోల్స్ సైతం వైసిపి, టిడిపి మధ్య పోటా పోటీగా ఉన్నాయి. పలు సర్వేలు వైసిపి గెలుస్తుందని, మరికొన్ని సర్వేలు టిడిపి గెలుస్తుందని వెల్లడించాయి. ఈనేపథ్యంలో అభ్యర్థుల్లో మరింత ఉత్కంఠ నెలకొంది. మంగళవారం మధ్యాహ్నానికి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల జాతకాలు ఒక్కొక్కటిగా తేలనున్నాయి. సాయంత్రానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏ పార్టీ వచ్చే అవకాశం ఉందో కూడా తేలనుంది. ఇందుకు ఇంకా ఒక్కరోజే సమయం ఉండడంతో కేవలం రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలే కాకుండా ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు, ఉపాధ్యాయులు, సాధారణ ప్రజానీకం కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.**



### అందరి నోటా గెలుపు ధీమా

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ వైసిపి, టిడిపి మధ్య హోరాహోరీగా పోరు నెలకొంది. 2,3 స్థానాల్లో వైసిపి గెలుపు అవకాశాలు దాదాపు ఖాయంగా ఉండగా, 4,5చోట్ల టిడిపికి గెలుపు అవకాశాలు ఉన్నాయి. మిగతా చోట్ల నువ్వానేనా అన్నట్లు పోటీ నెలకొంది. ఎవరు గెలిచినా స్వల్ప మెజార్టీతోనే అని విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. ఈనేపథ్యంలో ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కీలకం కానున్నాయి. మరో వైపు జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయలు బెట్టింగ్‌లు జరిగాయి. అభ్యర్థుల వారీ, మెజార్టీలు, అధికారంలోకి ఏ పార్టీ వస్తుంది ఇలా రక రకాలుగా బెట్టింగ్‌లు కాశారు. టిడిపి, వైసిపి ఒకదానికొకటి ప్రత్యామ్నాయ పార్టీలు కాదని, జాతీయ స్థాయిలో వీటి విధానం ఒక్కటేననే చర్చకూడా సాగుతోంది. గడిచిన ఐదేళ్ల కేంద్రంలోని బిజెపి చెప్పుచేతుల్లో వైసిపి పనిచేస్తే, అంతకు ముందు ఐదేళ్లు టిడిపి కూడా అదే బాటలో నడుచుకుందని పలువురు విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజా వ్యతిరే నిర్ణయాలు, చట్టాలు ఎన్నో జరిగాయని చెప్పుకుంటున్నారు. ఈనేపథ్యంలో జాతీయ రాజకీయాలే మన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రభావితం చేస్తాయని చెబుతున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో టిడిపితో బిజెపి పొత్తుపెట్టుకున్నప్పటికీ వైసిపి పట్ల వ్యతిరేక ప్రచారమేమీ చేయలేదు. దీన్ని బట్టి టిడిపితో పొత్తు, వైసిపితో తొత్తు అన్న చందంగానే వ్యవహరించిందని పలువురు విశ్లేషిస్తున్నారు. ఈ పూర్వపరాల నేపథ్యంలో మన రాష్ట్రంలో వైసిపి, టిడిపిల్లో ఏపార్టీ అధికారంలోకి వచ్చినా బిజెపికే మద్ధతు పలికే అవకాశాలు ఉంటాయని, మన రాష్ట్రం మద్దతుతో కేంద్రంలో మరోసారి బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగ విలువలు మరింత దిగజార్చే ప్రమాదం ఉంటుందని ప్రజాదృక్కోణంగల మేధావుల్లో చర్చ నడుస్తోంది. గెలుపోటములపై ఎవరికి వారే దీమా వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు మరోవైపు సంబరాలకు రెడీ అవుతున్నారు. విజయోత్సవాలు, ఊరేగింపులు నిషేధంలో ఉన్నప్పటికీ మందుగుండు సామగ్రి మాత్రం సిద్ధం చేసుకోవడం గమనార్హం. కౌంటింగ్ నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కౌంటింగ్ ఏజెంట్లు, కౌంటింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎన్నికల సంఘం విధివిధానాలపై పార్టీల వారీగా శిక్షణ శిబిరాలు నిర్వహించుకున్నారు. అధికారులు ఇప్పటికే కౌంటింగ్ ఏర్పాట్లు చేశారు. విధివిధానాలు, అనుసరించాల్సిన పద్ధతులపై జిల్లా కలెక్టర్ సారధ్యంలో సమావేశాలు పూర్తయ్యాయి. కౌంటింగ్ రోజూ 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

**తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలన్న విద్యార్థుల తల్లిదండ్రుల ఒకేఒక్క ఆశ కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు ఆదాయం తెచ్చి పెడుతోంది. తల్లిదండ్రుల నుంచి పాఠశాలల యాజమాన్యాలు వేలకు వేలు ఫీజుల భారం మోపుతున్నాయి. అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్స్, స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యాలు.. మళ్లీ పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూ.. అంటూ అందినకాడికి దోచుకుంటున్నాయి.**



# ప్రయివేటు పాఠశాలల్లో పుస్తకాల దందా

- పాఠ్య, నోట్‌పుస్తకాలపై అడ్డగోలు వ్యాపారం
- వేలకువేలు దోచుకుంటున్నా నోరుమెదపని విద్యాశాఖ



ప్రయివేటు పాఠశాలలో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పాఠ్య పుస్తకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను మాత్రమే బోధించాలి. దీనికి సంబంధించి వారి విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎంఇఒ కార్యాలయం ద్వారా పాఠ్యపుస్తకాలు తెప్పించుకోవాలి. ఆ రేట్లకే విద్యార్థులకు పుస్తకాలను ఇవ్వాలి. నోటు పుస్తకాలు విద్యార్థుల అవసరాన్ని బట్టి తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు విక్రయాల్లో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేసి వ్యాపారం చేస్తున్నాయి. పుస్తకాల కొనుగోలు ధరల కంటే రెట్టింపు వసూలు చేస్తున్నా విద్యాశాఖ అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. నిబంధలకు విరుద్ధంగా యూనిఫాం, టై, బెల్టు, బ్యాడ్జీ, షూ.. ఇలా అన్నీ తమ దగ్గరే కొనుగోలు చేసి తీరాల్సిందేనంటూ ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు హుకుం జారీ చేస్తున్నాయి, దీంతో తప్పక అడిగిన డబ్బులు చెల్లించి షాపుల్లో మాదిరిగా ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వాటిని కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో 600 వరకు ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పూర్తిస్థాయి వసతులున్న పాఠశాలలను వేళ్లమీదే లెక్కపెట్టవచ్చు. మౌలిక వసతుల లేమి, విద్యార్థులకు సరిపడా ఆటస్థలాలు లేవు. తరగతి గదుల కొరత ఉంది. అయినప్పటికీ, అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఇలా అరకొర వసతులతో పాఠశాలలు నిర్వహిస్తున్నా, ఫీజుల వసూళ్లలో మాత్రం పోటీపడి మరి వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు పుస్తకాల దోపిడీ అదనంగా ఉంటోంది. ప్రభుత్వ ధరల ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాల ధరలు రూ.280 నుంచి 700 వరకు ఉన్నాయి. వీటికి తోడు అదనంగా నోటు పుస్తకాలు కొనుగోలు చేయాల్సి ఉంది. పెద్ద తరగతులకు నోటు పుస్తకాల ఖర్చు కాస్త ఎక్కువగా ఉంటుందనుకున్నా... గరిష్టంగా రూ.1500 మించి ఉండదు. అన్నీ కలిపి పదో తరగతికి కూడా రూ.2 వేలతో పుస్తకాల ఖర్చు సరిపోవాల్సి ఉంది. అయితే ప్రయివేటు పాఠశాలలు ఇష్టానుసారంగా పుస్తకాల ధరల మోత మోగిస్తున్నాయి. ఎల్‌కెజి, యుకెజి తరగతులకే రూ.3 వేలకు పైగా వసూలు చేస్తున్నాయి. పెద్ద తరగతులకు రూ.5 వేల నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. తమ పిల్లల్ని ఎక్కడ వేధిస్తారోననే భయంతో తల్లిదండ్రులూ ప్రశ్నించడం మానేశారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయాలపై ఎస్ఎఫ్ఐ నాయకులు దాడులు చేస్తూ పట్టిస్తే, నామమాత్రంగా అధికారులు వెళ్లి చర్యలు తీసుకుంటున్నారు. అంతేతప్ప దోపిడీని అరికట్టే చర్యలు మాత్రం జిల్లాలో ఎక్కడా కానరావడం లేదు.

# సూక్ష్మ పరిశీలకులు అప్రమత్తం

### ఎన్నికల అబ్జర్వర్లు హనీష్ చాబ్రా, సీతారాం జాట్



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఓట్లను లెక్కించే సమయంలో సూక్ష్మ పరిశీలకులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా, సీతారాం జాట్ సూచించారు. కౌంటింగ్‌లో పాల్గొనే మైక్రో అబ్జర్వర్లకు కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం రెండో విడత శిక్షణ ఇచ్చారు. జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మితోపాటు జిల్లా ఎన్నికల పరిశీలకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, సూక్ష్మ పరిశీలకులకు దిశానిర్దేశం చేశారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు హనీష్ చాబ్రా మాట్లాడుతూ కౌంటింగ్‌లో సూక్ష్మ పరిశీలకుల పాత్రను వివరించారు. ప్రతిఒక్కరూ ఉదయం 6 గంటలకే తమకు కేటాయించిన కేంద్రాల్లోని టేబుళ్ల వద్దకు చేరుకోవాలని సూచించారు. రౌండ్ వారీగా నింపాల్సిన పట్టికలను కచ్చితమైన వివరాలతో పూర్తిచేసి, ఏజెంట్లతో సంతకాలు తీసుకోవాలని చెప్పారు. వాటిని అబ్జర్వర్లకు మాత్రమే అందజేయాలని సూచించారు. శృంగవరపుకోట నియోజకవర్గ పరిశీలకులు సీతారాం జాట్ మాట్లాడుతూ సూక్ష్మ పరిశీలకులకు ప్రతీ రౌండ్ కీలకమన్నారు. కచ్చితమైన వివరాలను నమోదు చేయాలని, ఎక్కడా పొరపాట్లు దొర్లకూడదని సూచించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల కమిషన్ తాజాగా జారీ చేసిన ఆదేశాలను వివరించారు. కౌంటింగ్ ప్రక్రియ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జరిగేలా చూడాల్సిన బాధ్యత మైక్రో అబ్జర్వర్లపై ఉందన్నారు. ట్రైనింగ్స్ నోడల్ అధికారి సుధాకరరావు మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్ల విధులు, బాధ్యతలు, కౌంటింగ్ ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో నెల్లిమర్ల, గజపతినగరం నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు డాక్టర్ డెబజిత్ ఖనికర్, స్నేహల్ ప్రతాప్ భోశలే, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుమబాల, ప్రమీలరాణి, లైజనింగ్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బంది కేటాయింపు**

సాధారణ ఎన్నికల కౌంటింగ్‌కు సిబ్బందిని రాండమైజేషన్ ద్వారా ఎన్నికల పరిశీలకుల ఆధ్వర్యంలో కలెక్టర్ నాగలక్ష్మి ఆదివారం ఆయా నియోజకవర్గాలకు కేటాయించారు. ఇందుకు గానూ 306 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లను, 376 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను, 325 మంది మైక్రో అబ్జర్వర్లను కలిపి మొత్తం 1007 మందిని ర్యాండమైజేషన్ ద్వారా కలెక్టర్ కేటాయించారు. ఈ కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు హనిష్ చాబ్రా, సీతారాం జాట్, స్నేహల్ ప్రతాప్ భోస్లే, దేబజిత్ ఖనికర్, జెసి కార్తీక్, డిఆర్ఒ అనిత, డిఐఒ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ ఏర్పాట్లు సంతృప్తికరం

### ఎన్నికల పరిశీలకులు దేబజిత్



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎన్నికల పరిశీలకులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చేసిన ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయని ఎన్నికల సంఘం తరపున ఓట్ల లెక్కింపు పరిశీలకులుగా నియమితులైన డాక్టర్ దేబజిత్ ఖనికర్ అన్నారు. లెండి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. నెల్లిమర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థుల తరపున కౌంటింగ్ ఏజెంట్లు నిర్ణీత సమమానికి వచ్చేలా చర్యలు చేపట్టాలని, తద్వారా కౌంటింగ్ సకాలంలో ప్రారంభించేందుకు వీలవుతుందని చెప్పారు. దీనిపై అభ్యర్థులకు ముందుగా సమాచారం అందించాలని రిటర్నింగ్ అధికారి నూకరాజుకు సూచించారు. అనంతరం కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమాచార కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ మీడియాకు చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఆయన వెంట లైజన్ అధికారి లక్ష్మీనారాయణ కూడా ఉన్నారు.

**పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కేంద్రం పరిశీలన**

లెండి కళాశాలలో ఏర్పాటు చేసిన విజయనగరం పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌ను ఆదివారం కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా.. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం అనుసరించనున్న పద్ధతులు, ఏర్పాట్లను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వివరించారు.

# ఎపిజిఇఎ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటరమణ, భాస్కరరావు



వెంకటరమణ



భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎపిజిఇఎ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కంది వెంకటరమణ, బి.భాస్కరరావు ఎన్నికయ్యారు. ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర పరిశీలకులు ఎస్‌వి రమణ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా వారిని ఎన్నుకున్నారు. వారితో రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి నిరంతరం పనిచేస్తామని సూర్యనారాయణ తెలిపారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదార్లకు నష్టం జరుగుతున్నా, చోద్యం చూస్తున్న ఉద్యోగ సంఘాలకు భిన్నంగా ఎపిజిఇఎ ముందుకు వెళ్తుందని చెప్పారు. ద్యోగుల గొంతుకగా ముందుకు వెళ్లి ఉద్యోగులు గర్వించే విధంగా పనిచేస్తామని తెలిపారు. అనంతరం తెలుగు సంవత్సర కేలండరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆదివాసీ ఉద్యోగుల సమస్యలపై వినతి



ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు వినతి అందిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఎపి ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావును ఆయన క్యాంప్ కార్యాలయంలో ముంబై సెంట్రల్ యునివర్సిటీ ప్రొఫెసర్, ఆలిండియా ఆదివాసీ ఉద్యోగుల ఫెడరేషన్ ఆర్గనైజర్ డాక్టర్ చేతన్ కుమార్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జాతీయ స్థాయిలో ఆదివాసీ ఉద్యోగులకు సంబంధించిన వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వివిధ రాష్ట్రాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెలలో జరిగే సదస్సుకు ఆయన్ను అతిథిగా ఆహ్వానించారు. ఎపి ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఎఎస్ఆర్ జిల్లా చైర్మన్ రామారావు దొర మన్యం ప్రాంతంలో ఆదివాసీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజర్ సోమేలి సింహాచలం, సభ్యులు సుబ్లారి గురుదొర, చెర్రికి సింహాచలం, వంతల కామేశ్వరరావు, మాసాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మన్యం ధీరుడు సినిమా పోస్టర్ ఆవిష్కరణ



మన్యం ధీరుడు సినిమా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అశోక్ గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మన్యం ధీరుడు సినిమా పోస్టర్ రిలీజ్ కార్యక్రమం ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో జరిగింది. పోస్టర్‌ను కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భ:గా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన అల్లూరి సీతారామరాజుకు దేశ ప్రజలంతా అభిమానులేనని చెప్పారు. గిరిజనులపై యథేచ్ఛగా అకృత్యాలకు పాల్పడుతూ చిత్ర హింసలకు గురిచేస్తున్న బ్రిటిష్ నరహంతకుల నుంచి ఆదివాసీలను కాపాడేందుకు అల్లూరి చేసిన తిరుగుబాటు చరిత్ర ఎన్ని సార్లు అయినా చూడాలని అపిస్తుందన్నారు. చరిత్రను అనుసరించి వాస్తవాలకు దగ్గరగా సినిమా తీయాలని సూచించారు. కార్యక్రమంలో సినీ నిర్మాత, హీరో సత్యనారాయణ, డైరెక్టర్ నరేష్, తిరుమల రాజు రంగరాజు (వేణు), సీనియర్ న్యాయవాది నాలుగెస్సుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# చేపల వ్యాపారులపై కేసులు నమోదు



తూనికరాళ్లను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ దామోదరనాయుడు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని రింగురోడ్డు వద్ద చేపల విక్రయాలను ఆదివారం లీగల్ మెట్రాలజీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. చట్టవిరుద్ధమైన తూనిక రాళ్ల వినియోగిస్తూ, వినియోగదారులను తూకంలో మోసగిస్తున్న ముగ్గురు చేపల వర్తకులపై కేసులు నమోదు చేశారు. ఇదే వర్తకులపై గతంలోనూ కేసులు నమోదైనట్లు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదరనాయుడు తెలిపారు. ఇంకోసారి ఇటువంటి మోసాలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఎక్కడైనా మోసాలు గుర్తిస్తే తమ శాఖకు తెలియజేయవచ్చని వినియోగదారులకు సూచించారు.

# కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎన్‌సిఎస్ గ్రూపు అధినేత నారాయణం శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళలు ఆర్థికంగా ఎదగాలని, చేతివృత్తుల పనుల ద్వారా ఇది సాధ్యమేనని ఎన్‌సిఎస్ గ్రూపు అధినేత నారాయణం శ్రీనివాస్ అన్నారు. ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బలిజవీధి సంఘం భవనం వద్ద ఆదివారం కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు స్వయంగా ఆర్థికాభివృద్ధి సాధించడానికి కుట్టు శిక్షణ కేంద్రాలు ఎంతో ఉపయోగ పడతాయని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షులు బలభద్రుని నానాజీ మాట్లాడుతూ ప్రస్తుతం 54 మంది మహిళలకు శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కస్పా ఆర్యవైశ్య సంఘం నూతన భవన నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళంగా అందించింది. కార్యక్రమంలో కార్యదర్శి పేర్ల సీతారామయ్య శెట్టి, కోశాధికారి కందుల సంతోష్, వెత్సా శ్రీనివాసరావు, పలివెల శ్రీనివాస్, అక్షింతల సతీష్, శిరం గవరరాజు, కంచెర్ల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు నిత్యావసరాలను అందిస్తున్న ఎఎస్ఐ పైడిరాజు, తదితరులు

## ఒంటరి వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తవలస

వృద్ధులను ఆదుకోవడం గొప్ప విషయమని స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ పైడి రాజు అన్నారు. తుమ్మికాపల్లి వద్ద గల ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాధ్ హరికుమార్ ఆధ్వర్యంలో 42 మంది ఒంటరి వృద్ధులకు ఆదివారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు కవి చెరుకూరి తరుణ్ దంపతులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగి రమణ, ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి పాల్గొని వృద్ధులకు సరుకులను అందించారు. ట్రస్ట్ ట్రెజరర్ విశ్వనాధ శ్రావణ్ కుమార్, సభ్యులు గణేష్, నగేష్, గోవిందా తదితరులు పాల్గొన్నారు.

## ఫలితాలపై సంయమనం పాటించాలి

ప్రజాశక్తి - రామభద్రపురం


గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

ఎన్నికల ఫలితాలపై సంయమనం పాటించాలని బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాస రావు సూచించారు. ఆరికతోట ఓల్డ్ బజార్ సెంటర్లో సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో శనివారం రాత్రి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చావు, పుట్టక గెలుపు, ఓటమి సర్వ సాధారణమని ఫలితాల రోజున కవ్వింపు చర్యలకు దిగకుండా సమానత్వ ధోరణితో మెలగాలని హితవు పలికారు. ఈ నెల 6 వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని విజయోత్సవాలు, బాణాసంచా, సౌండ్ సిస్టమ్, ర్యాలీలు నిర్వహించరాదని అన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించక చట్టాలకు లోబడి నడుచుకోవాలన్నారు. తమ సిబ్బంది ఆధ్వర్యంలో కార్డన్ తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని ప్రతీ వాహనానికి తప్పనిసరిగా సంబధిత పత్రాలు ఉండాలని లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరా దని, మైనర్‌లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఐ జ్ఞాన ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.


విద్యార్థులకు రామాయణం గురించి వివరిస్తున్న అర్చకులు రఘు

## రామాయణంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక శాఖా గ్రంధాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు లైబ్రేరియన్ మహేశ్ కథలు చెప్పారు. అనంతరం స్థానిక వేంకటేశ్వర స్వామి దేవాలయం అర్చకులు రఘుతో విద్యార్థులకు రామాయణ, మహా భారత విశేషాలు గురించి చెప్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులు పలు క్రీడలు ఆడారు.

**వేపాడ**: మండల కేంద్రంలో గల శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులలో భాగంగా లైబ్రరీ ఎం చంద్రశేఖర్ ఆదివారం సోలార్ సిస్టం( సౌర వ్యవస్థ) గురించి వివరించారు. కంప్యూటర్ బేసిక్ నేర్పించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.


క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న వైద్యులు

## క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో జరుగుతున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో ఆదివారం క్రీడాకారులకు వైద్యులు డాక్టర్ ఎస్ వి సత్యశేఖర్, ఆనల రమేష్, చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, తల్లిదండ్రులు చేతుల మీదుగా క్రీడా దుస్తుల పంపిణీ చేశారు. అనంతరం శిక్షణ శిబిరంలో జరుగుతున్న టోర్నమెంటులో ఫైనల్స్‌కు చేరుకున్న క్రీడాకారులు వారు ప్రదర్శిస్తున్న ఆటను సత్య శేఖర్ తిలకించి, క్రీడాకారులకు స్పోర్ట్స్ ఇంజురీస్‌పై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారుల తల్లిదండ్రులు, కోచ్ మహమ్మద్ అస్లాం, బి.హారిక, పి.మౌనికలు పాల్గొన్నారు.


వ్యర్థాలను సేకరిస్తున్న సభ్యులు

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

ప్రజాశక్తి - కొత్తవలస

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని బెటర్ ఎర్త్ ఇండియా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అన్నారు. ఆదివారం బెటర్ ఎర్త్ ఇండియా ఛారిటబుల్ ట్రస్ట్- పర్యావరణ పరిరక్షణ, సోషల్ వర్క్ లాభాపేక్ష లేని సంస్థ బీచ్ క్లీన్ అప్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పిల్లలు, పెద్దలు సహా ఇరవై మంది వాలంటీర్ల బృందం పాల్గొంది. విశాఖపట్నంలోని విక్టరీ ఎట్ సీ మెమోరియల్ ముందు బీచ్‌లో ఈ డ్రైవ్ నిర్వహించారు. బీచ్‌లో విందు చేసేవారు ప్లాస్టిక్, పేపర్‌లను ఉపయోగించడం వల్ల చాలా వరకు వ్యర్థాలు పేరుకుపోతున్నాయని గుర్తించి వాటిని ఒక కిలోమీటరు పొడవును రెండు గంటలలోపు ఏరివేశారు. 2020 నుండి పర్యావరణ సమస్యలపై తమ ట్రస్ట్ దృష్టి సారిస్తోందని నిర్వాహకులు తెలిపారు.

# పింఛనర్లకు అవే తిప్పలు

- జూన్‌లోనూ బ్యాంకుల వద్ద పడిగాపులే
- ఎండలో మండిపోయిన వృద్ధులు
- ఇంటివద్దనే పింఛను ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - వేపాడ

సామాజిక పింఛనుదారులకు మే నెలలో పడిన ఇబ్బందులే జూన్ నెలలో కూడా ఎదుర్కొంటున్నారు. జూన్ నెలలో ఇవ్వాల్సిన పింఛనుదారుల సొమ్ము బ్యాంకులకు సకాలంలో రాకపోవడంతో ఒకటో తేదీన సచివాలయ సిబ్బంది పూర్తిస్థాయిలో పింఛనుదారులకు మంజూరైన సొమ్మును అందజేయలేక పోయారు. మంచానికే పరిమితమైన వారికి ఒకటో తేదీన పింఛన్ సొమ్ము అందించినా మిగతా వారి సొమ్ములను బ్యాంకులకు వేయడంతో వృద్ధులు బ్యాంకులు వద్దకు పరుగులు తీశారు.అయితే శనివారం కొంత మందికే బ్యాంకు వద్ద పింఛను సొమ్ము అందగా ఆదివారం సెలవు కావడంతో సోమవారం కోసం వేచి చూస్తున్నారు. కొంత మంది మాత్రం ఎస్‌బిఐ కస్టమర్ ఖాతా సేవ కేంద్రం ద్వారా పింఛను సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు బారులు తీరారు. ఆ సేవా కేంద్రం ఆవరణ చుట్టూ చెట్లు కింద, బల్లల పైన మెట్ల వద్ద పింఛను సొమ్ము కోసం పడిగాపులు కాశారు. గతంలో ఇంటి వద్దకే తమకు మంజూరైన పింఛను వచ్చేదని, ప్రస్తుతం ఎన్నికల కోడ్ నెపంతో ఈ విధంగా ఇబ్బంది పెట్టడం సమంజసంగా లేదని పలువురు వృద్ధులు వాపోయారు.



ఖాతాదారుల సేవా కేంద్రం వద్ద పింఛన్లు కోసం వేచి ఉన్న వృద్ధులు

**మనిషికి ఆటో ఛార్జీ రూ.100**

నల్లబెల్లి, వావిలిపాడు, కెజిపూడి, ముకుందపురం నుంచి పింఛను సొమ్ము కోసం బ్యాంకుకు రావాలంటే ఆటోలపై రావాలని కనీసం మనిషికి రాను పోను రూ. 100 ఛార్జీ అవుతుందని చెబుతున్నారు. వచ్చిన రోజే పింఛను అందిపోతే ఫరవాలేదని మరో రోజు రావాలంటే మరో రూ.100 ఛార్జీ పెట్టుకుని రావాలని ఇదంతా తమకు అదనపు భారమేనని వృద్ధులు వాపోతున్నారు. వచ్చే నెల అయినా ఇంటి వద్దకే పింఛను అందే విధంగా ఏ ప్రభుత్వం వచ్చినా ఇబ్బందులు లేకుండా పింఛనదారులకు పింఛను అందించాలని వారంతా కోరుతున్నారు.



**కర్ర ఊతలేనిదే అడుగు వేయలేను**

నేను కర్ర ఊత లేనిదే అడుగు బయటకు వేయలేను. ఇంతకు ముందు ఇంటికి తెచ్చి పింఛను సొమ్ము ఇచ్చేవారు. గత రెండు మూడు నెలలుగా మండల కేంద్రానికి వచ్చి తీసుకోవాల్సి వస్తుంది. ఇలా బయటకు వచ్చి పింఛను తీసుకోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నాను. వచ్చే నెల నుంచైనా ఇంటికి తెచ్చి పింఛను ఇస్తే బాగుంటుంది.

**కోన మహాలక్ష్మి, వల్లంపూడి**

**అనారోగ్యంతో ఉన్నా తప్పలేదు**



నేను చాలా కాలం నుంచి అనారోగ్యంతో బాధపడు తున్నాను. అయినా నాకు మంజూరైన పింఛను సొమ్ము కోసం బ్యాంకుకు రాక తప్పలేదు. నాకు గత నెల స్టేట్ బ్యాంకు కస్టమర్ ఖాతా సేవా కేంద్రం ద్వారా పింఛను సొమ్ము ఇచ్చారు. ఈ సారి నేరుగా బ్యాంకకు వెళ్ళి తీసుకోవాలని చెబుతున్నారు. మళ్లీ సోమవారం బ్యాంకకు రావాల్సి ఉంది. ఇలా కోడ్ పేరిట వృద్ధులను ఇబ్బంది పెట్టడం మంచి పద్ధతి కాదు. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలి.

**షేక్ ప్యారి, వృద్ధురాలు, భరతవానిపాలెం.**

# మాయమైన మరు భూమి

- ఆఖరి క్షణాలకు తప్పని అవస్థలు
- చోద్యం చూస్తున్న గ్రామ పెద్దలు
- ఆందోళనలో జామి ప్రజానీకం

ప్రజాశక్తి - జామి

**ఎంత సంపాదించినా... ఏమీ సాధించినా... ఆఖరి క్షణాలకు ఆరడుగుల నేల చాలంటారు... కానీ జామి ప్రజలకు ఆ ఆరడుగుల నేల కరువైంది. ఏ చిన్న కుగ్రామం వెళ్లినా, ఊరు చివరిన ఉండే.. మరు భూములు భూ కైలాశాలను తలపిస్తున్నాయి. కానీ వేలాది ప్రజానీకం ఉన్న జామిలో మనిషి చనిపోతే దహన సంస్కరణలకు అవస్థలు పడాల్సిన పరిస్థితులు దాపరించాయి. జామి గ్రామంలో ఏ ఒక్కరిని తట్టినా, వారి నోట వినిపించే వేదన ఇది.**

గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణంతో గ్రామాల్లో వందల ఎకరాలు పోగొట్టుకున్న విషయం తెలిసిందే. రైతుల భూములతో పాటు గ్రామానికి తాతల తండ్రుల నుంచి ఉన్న మరు భూమిని కూడా హైవే మింగేసింది. మండల కేంద్రంలో 16వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఇందులో సర్వ మతాల వారు ఉన్నారు. దళితులు, ముస్లింలకు తప్ప దాదాపుగా గ్రామంలో ప్రజానీకం మొత్తానికి ఒకటే శ్మశానం. ఈ నేపథ్యంలోనే మరు భూమి తీవ్రమైన సమస్యగా మారింది. వాస్తవానికి గతంలో ఉన్న మరు భూమి కూడా అభివృద్ధికి నోచుకోని పరిస్థితి. శ్మశానంలో ఒక పాడుబడ్డ షెడ్, ఒక చేతి బోరు మాత్రమే ఉండేవి. హైవే పుణ్యమా అంటూ అవి కూడా లేకుండా పోయాయి. కనీసం నిలువ నీడ నిచ్చే చెట్టు కూడా అక్కడ లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.


రూపు కోల్పోయిన శ్మశనవాటిక

### శ్మశాన స్థలం మీదుగా హైవే

జాతీయ రహదారి నిర్మాణం శ్మశాన స్థలం మీదుగా వెళ్లిపోయింది. దీంతో ఉన్న కొద్ది పాటి మరు భూమి లేకుండా పోయింది. పోనీ ఉన్న జాగవా, ఊరు మొత్తానికి మరు భూమిగా వాడడడం సాధ్యం కాదు. దీంతో హైవే అవతల వైపు కొంత బాగాన్ని అధికారులు గుర్తించినప్పటికీ, అది దాటేందుకు నానా అవస్థలు పడాలని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోనీ ఆ స్థలాన్ని అయినా అభివృద్ధి చేశారంటే అదీ లేదు. దీంతో మారుభూమి సమస్య సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. గ్రామ పెద్దలు, అధికారులకు శ్మశాన సమస్య పట్టడం లేదని ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా మరు భూమి సమస్య పరిష్కారంతో పాటు అభివృద్ధి విషయంపై పంచాయతీ పాలకవర్గంతో పాటు పెద్దలు ఆలోచన చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కోడి పందేలపై దాడి

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని కోడూరు పంచాయతీ బ్రాహ్మణవలస గ్రామంలోని మామిడి తోటలో జరుగుతున్న కోడి పందేలపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఐదుగురుని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయంతి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1560 నగదు, 2 కోళ్లు పట్టుబడ్డాయని చెప్పారు. వీరంతా వేరువేరు గ్రామాల నుంచి వచ్చి ఇక్కడ పందేలు ఆడుతున్నారని ఇటువంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బొబ్బిలిలో వర్షం..ప్రజల్లో హర్షం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి, పరిసర గ్రామీణ ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం ఎండ తీవ్రతతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సాయంత్రం వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో ప్రజలు సేద తీరారు. వర్షంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# పక్క జిల్లాల ఫైరింజన్లే దిక్కు

- అగ్నిప్రమాదం జరిగితే శ్రీకాకుళం, విశాఖ వాహనాలు రావాల్సిందే
- దూరం కావడంతో వచ్చేలోపు సర్వం కోల్పోతున్న బాధితులు
- కలగానే మిగిలిన అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - భోగాపురం

నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే పక్క జిల్లాల నుంచి ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపుచేయాల్సిన పరిస్థితి. ఆ ఫైరింజన్లు వచ్చేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుందని బాధితులు వాపోతున్నారు. నాయకులు మాత్రం ఎన్నికల్లో గత 20 ఏళ్ళ నుంచి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తూనే ఉన్నారు. ఇచ్చి మర్చిపోతుండడం విశేషం. నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం లేకపోడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. భోగాపురం మండలంలో ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే ఇటు విశాఖ జిల్లా ఆనందపురం సమీపంలో ఉన్న అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్ వస్తుంది. అది అందుబాటులో లేకపోతే జిల్లా కేంద్రంలో నుంచి వస్తుంది. ఏది ఏమైనా ఎటునుంచి వచ్చినా సుమారు 30 కిలో మీటర్లు పైనే ఉంటుంది. పూసపాటిరేగ మండలంలో ఎక్కడైనా ప్రమాదం జరిగితే ఇటు జిల్లా కేంద్రం నుంచి, శ్రీకాకుళం జిల్లా రణస్థలం నుంచి వస్తుంది. దీనితో అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇటు డెంకాడ నెల్లిమర్ల మండలాల పరిస్థితి కూడా ఇదే మాదిరిగా ఉంది.


అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న ఇళ్లు (ఫైల్)

**హామీ ఇచ్చి మర్చిపోతున్న నాయకులు**

ప్రతిసారి ఎన్నికల సమయంలో నాయకులు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తామని గత కొన్నేళ్ళు నుంచి హామీ ఇస్తున్నారేగాని నేటికీ మంజూరు చేయలేకపోయారు. నెల్లిమర్ల, డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో తొలుత నాతవలస జంక్షన్‌లో ఏర్పాటు చేయాలనుకున్నారు. ఆ తరువాత అక్కడ స్థలం లేదనే ఉద్దేశంతో మళ్ళీ కోనాడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. టిడిపి ప్రభుత్వం హయాంలో స్థలాన్ని కూడా పరిశీలించారు. కాని అప్పుడు కూడా మంజూరు కాలేదు. వైసిపి ప్రభుత్వం హయాంలోనైనా మంజూరు అవుతుందని ఊహించారు కాని నెరవేరలేదు.

**సర్వం కోల్పోతున్న బాధితులు**

నియోజకవర్గం పరిధిలో ఏ మండలంలోలైనా అగ్ని ప్రమాదం జరిగితే బాధితులు సర్వం కోల్పోతున్నారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లోని తీరప్రాంత గ్రామాల్లో ఇప్పటికీ పూరిపాకలు ఉన్నాయి. పదేళ్ళ కిందట చినకొండ్రాజుపాలెం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 70 ఇళ్ళు కాలిపోయాయి. కారి గొల్లపేటలో జరిగిన అగ్నిప్రమాదంలో కూడా సుమారు 40 ఇళ్ళు కాలిపోయాయి. నియోజకవర్గంలో ఇలాంటి ప్రమాదాలు ఎన్నో జరుగుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేస్తే వారొచ్చేసరికి సుమారు 40 నిమిషాలు సమయం పడుతుంది. దీంతో సర్వం కోల్పోతున్నారు. నియోజకవర్గం పరిధిలో అగ్నిమాపక కేంద్రం అందుబాటులో ఉంటే ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## వర్షపు నీరు కాదు.. తాగునీరే...!

**పక్కనే చిత్రంలో కనిపిస్తున్న పాఠశాల ప్రాంగణంలోని నీరు వర్షం ద్వారా వచ్చిందనుకుంటే పప్పులో కాలేసినట్లే.. ఈ దంతా తాగునీరు.. మండలంలోని కొత్తూరు గ్రామం వద్ద విశాఖ అరకు ప్రధాన రోడ్డులో కృష్ణాపురం వాటర్ ట్యాంక్ నుంచి విశాఖపట్నంకు తాగునీరు అందించే పైపులైను ఉంది. దీనికి భారీ లీకు ఏర్పడింది. దీంతో రెండు రోజులుగా తాగునీరు భారీ ఎత్తున వృధాగా పోతుంది. ఈ విషయం తెలిసినా సంబంధిత అధికారులు ఎవరు ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం బాధాకరం. ఈ లీకేజ్ వల్ల కొత్తూరు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణమంతా నీట మునిగింది. వేసవి కాలంలో తాగునీటికి ఒక పక్క ఇబ్బందులు పడుతున్నా లీక్‌లను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారనడానికి ఈ చిత్రమే నిదర్శనం. వెంటనే ఈ తాగునీటి వృధాను అరికట్టాలని స్థానికలు కోరుతున్నారు. ఈ విషయంపై కృష్ణాపురం జన శుద్ధి కర్మాగారం జెఇ రాజకుమార్‌ను వివరణ కోరగా లీకు వద్ద మరమ్మతులు చేసి అరికడతామని చెప్పారు.**


చెరువును తలపిస్తున్న పాఠశాల ప్రాంగణం

**- ప్రజాశక్తి, శృంగవరపుకోట**

## ఆక్రమణలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వ స్థలాలు, చెరువులు ఆక్రమిస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మిలటరీ కాలనీ వద్ద చెరువును ఆక్రమణ చేసేందుకు చదును చేయడం అన్యాయమన్నారు. మున్సిపాలిటీలో కారిపోనుబంద, పక్షులుబంద, శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు పక్కనున్న బంద ఆక్రమణకు గురైనా చర్యలు లేవన్నారు. చెరువులు ఆక్రమిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉన్న రాజకీయ ఒత్తిళ్లతో చర్యలకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురవుతు న్నాయని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఆయనతో టైలర్ సంఘం గౌరవ అధ్యక్షులు నరం అప్పారావు ఉన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శంకరరావు

## ఆకులసీతంపేట వద్ద రోడ్డుకు కొలతలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురం జంక్షన్ నుంచి వేపాడ మీదుగా ఆనందపురం జంక్షన్ వరకు చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా ఆకుల సీతంపేట వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఒకవైపే స్థలాన్ని సేకరించి రెండో వైపు వదిలేశారు. దీంతో మలుపు వద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని పలుమార్లు ప్రజాశక్తి దినపత్రికలో కథనాలు వచ్చాయి. దీనికి తోడు ఆ గ్రామానికి చెందిన జి.శ్రీను ఆర్‌టిఐకు దరఖాస్తు ద్వారా ఆకుల సీతంపేట గ్రామంలో రోడ్డు విస్తరణ చేపట్టిన వివరాలు, కొలతలు ఇవ్వాలని కోరాడు. దీంతో ఆదివారం సెలవు అయినప్పటికీ రోడ్డుకు ఇరువైపులా ఎంత స్థలం అవసరం, ఎంత సేకరించామన్న దానిపై ఆదివారం అధికారులు కొలతలు వేశారు. ఇప్పటికైనా అధికారులు నిబంధనల మేరకు మలుపు వద్ద ప్రమాదాలకు అవకాశం లేకుండా రాజకీయ నాయకులకు తొత్తులుగా వ్యవహరించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాని గ్రామస్తులు కోరుతున్నారు.


కొలతలు వేస్తున్న అధికారులు